క్లుప్తంగా

అందుబాటులో యూరియా

కంచికచర్ల: మండలంలో పలు ప్రైవేటు డీలర్ల వద్ద 77.02 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఏవో కే విజయకుమార్ శనివారం తెలిపారు. షాపుల వారీగా యూరియా నిల్వలను ఆయన వివరించారు. రైతులు తమ అవసరాలకు వినియోగించుకోవాలని కోరారు.

డ్రోన్‌తో ద్రవ జీవామృతం పిచికారీ



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు గ్రామంలో శుక్రవారం 10 ఎకరాల వరి పొలంలో ద్రవ జీవామృతాన్ని డ్రోన్ ద్వారా చల్లారు. ప్రకృతి వ్యవసాయం డివిజన్ మాస్టర్ ట్రైనర్ వన్నూరప్ప దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ద్రవ జీవామృతం తయారీకి 10 లీటర్లకు రూ.50 ఖర్చు అవుతుందన్నారు. డ్రోన్‌తో పొలంలో స్ప్రే చేయటం వలన పంట మొత్తం సమానంగా పిచికారీ జరుగుతుందన్నారు. రైతు స్వయంగా స్ప్రే చేయాలంటే ఐదుగురు కూలీల అవసరం ఉంటుందని, డ్రోన్ ద్వారా స్ప్రే చేసేందుకు పొలం రైతు, డ్రోన్ డ్రైవర్ ఉంటే సరిపోతుందన్నారు. ద్రవ జీవామృతం పిచికారీ చేయటం వలన పంటల ఎదుగుదలతో పాటు దిగుబడి బాగుంటుందన్నారు. చీడపీడలు కూడా దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు రాజశ్రీ, పావని, రైతులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సత్కారం

నందిగామ రూరల్: ముగ్గురు న్యాయవాదులను రాష్ట్ర స్థాయి పదవులు వరించటం అభినందనీయమని బార్ అసోసియేషన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు చెరుకుమల్లి రామారావు పేర్కొన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ హాల్‌లో ఏపీపీ కాట్రు సత్యనారాయణతో పాటు పదవులు పొందిన వక్ఫ్‌బోర్డు స్టాండింగ్ కౌన్సిల్ షేక్ కరిముల్లా, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ గండ్రాల రత్నకుమార్, మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి పొందిన ఇంటి మాల ప్రవీణలను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నండ్రు బాబు విద్యాసాగర్, న్యాయవాదులు మట్టా ప్రసాద్, నండ్రు శ్రీరామ్మూర్తి, కురగంటి కృష్ణంరాజు, కోట దేవదాసు, వెంకటరత్నం, డేవిడ్ రాజు, బలుసుపాటి సురేష్, సుమ్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

361 మందికి నేత్ర వైద్య పరీక్షలు



తోటచర్ల(పెనుగంచిప్రోలు): మండలంలోని తోటచర్ల గ్రామంలో శుక్రవారం జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో మొత్తం 361 మంది రోగులు పరీక్షించుకోగా వారిలో 150 మంది జనరల్ వైద్య సేవలు పొందగా 211 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారని నిర్వాహకులు తెలిపారు. వారిలో 111 మందికి కళ్లజోళ్లు అవసరం కాగా, 52 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. విజయవాడలోని శంకర్ కంటి ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు త్వరలో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, సొసైటీ అధ్యక్షుడు వేముల వెంకటేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచ్ సైదేశ్వరరావు, కార్యక్రమ కో ఆర్డినేటర్లు కట్టా వెంకటనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయాల మూసివేత

జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి, వేదాద్రి గ్రామాలలోని వెంకటేశ్వరస్వామి, యోగానందలక్ష్మి నరసింహస్వామి ఆలయాలు చంద్రగ్రహణం కారణంగా మూసివేస్తున్నట్లు ఆలయ ఈవోలు సాంబశివరావు, సురేష్‌బాబు శనివారం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సోమవారం ఉదయం ఎనిమిది గంటల వరకు ఆలయాలను మూసి దర్శనాలను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. సంప్రోక్షణ అనంతరం దర్శనం కల్పిస్తామని తెలిపారు. భక్తులు గమనించాలని కోరారు.

ఆలయానికి వితరణ

నందిగామ టౌన్: పట్టణంలోని నెహ్రూ నగర్‌లో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి పట్టణానికి చెందిన ప్రత్తిపాటి ఫణికుమార్, సీతామహాలక్ష్మిల కుమారుడు గణేష్ ప్రభు రూ. 25 వేలను విరాళంగా అందించినట్లు ఆలయ చైర్మన్ విశ్వేశ్వరరావు శనివారం తెలిపారు. దాతలకు ప్రత్యేక పూజలనంతరం స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మధు, శ్రీనివాసరావు, కేదార్‌నాథ్, పలువురు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంక్

- కొత్త ట్యాంకు నిర్మిస్తామని ఏడేళ్ల క్రితం కొబ్బరికాయ కొట్టిన ఎమ్మెల్యే సౌమ్య
- ఇప్పటికీ పట్టించుకోని వైనం



గండేపల్లిలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు



ట్యాంకు పిల్లర్‌కు బయటకు వచ్చిన ఇనుప చువ్వలు

గండేపల్లి(కంచికచర్ల): నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలిపోతుందోనని సమీపంలో నివసించే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని గండేపల్లిలో 1984- 85 సంవత్సరంలో రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారు. నేడు శిథిలావస్థకు చేరింది.

కూలేందుకు సిద్ధంగా..

శిథిలమైన ఓవర్‌హెడ్‌ట్యాంకు ఎప్పుడైనా కూలిపోవచ్చని ప్రజలు భయపడుతున్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుకు ఏర్పాటు చేసిన పిల్లర్‌లకు ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. కమ్యూనిటీ స్థలంలో నిర్మించిన ట్యాంకు పక్కనే విద్యార్థులు క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ పలు క్రీడలు ఆడుతుంటారు. దీంతో రోజూ భయపడిపోతున్నారు. గ్రామ పంచాయతీ పాలకులు, అధికారులు తాగునీటిని ట్యాంకులో నింపటం లేదు. ట్యాంకు చుట్టూ ముళ్ల కంపలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో విషపురుగులు సంచరిస్తున్నాయని మహిళలు ఆరోపిస్తున్నారు.

ట్యాంకు పక్కనే అంగన్‌వాడీ కేంద్రం..

ట్యాంకు సమీపంలో అంగన్‌వాడీ ప్రీ స్కూల్ ఉంది. అంగన్‌వాడీ కార్యకర్త, పిల్లలు బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. పిల్లల సంరక్షణ కోసమైనా తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఏడేళ్లక్రితం కొబ్బరికాయ కొట్టిన ఎమ్మెల్యే..

గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శిథిలావస్థ దశకు చేరిన ట్యాంకును కూల్చివేసి కొత్త ట్యాంకు నిర్మిస్తామని కొబ్బరికాయలు కొట్టారు. త్వరలోనే పనులు చేపడతామన్నారు. కానీ మళ్లీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా నేటికీ ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా శిథిమైన ఓవర్ హెడ్ ట్యాంకును తొలగించి కొత్త ట్యాంకు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు



గ్రామంలో ఎస్సీకాలనీలో 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలమై పోయింది. ఈ విషయం గురించి మండలస్థాయి అధికారులకు అనేకసార్లు చెప్పినా పట్టించుకోలేదు. ఎప్పుడు కూలిపోతుందోనని ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పగుళ్లు ఇచ్చిన ట్యాంకును తొలగించి కొత్త ట్యాంకు నిర్మించాలి.

– బొక్కా రవికుమార్, సర్పంచి, గండేపల్లి

ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



ప్రోత్సాహక బహుమతులు స్వీకరించిన విద్యార్థులతో ఎన్ఆర్ఐ శ్రీనివాసరావు

పేరకలపాడు(కంచికచర్ల): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావటం అభినందనీయమని ఎంఈఓ-1 ఉలవలపూడి గురునాథం అన్నారు. మండలంలోని పేరకలపాడు గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌లో అన్ని తరగతుల్లో మొదటి, ద్వితీయ, తృతీయ విభాగంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ చవళం శ్రీనివాసరావు నగదు, మెమోంటోలు శనివారం అందజేశారు. 6,7,8 తరగతుల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.2 వేలు, 3,4,5 తరగతుల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.1500, 1,2 తరగతుల్లో మంచి మార్కులు సాధించిన వారికి రూ.1000 చొప్పున నగదు అందజేశారు. గ్రామంలో పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థికి రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సర్పంచి ఎం.సాత్విక, ఎంఈఓ-2 బాలాజీ, హెచ్ఎం.శేషం గోపాలరావు, ఉపాధ్యాయులు మందా సుధాకర్, డీ సాంబశివరావు, శ్రీనివాస నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సేవా సమితి నిర్వాహకులు

నందిగామ టౌన్: దాతల సహకారంతో సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగ వ్యక్తుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయటం సంతోషంగా ఉందని సేవా సమితి నిర్వాహకుడు రామిరెడ్డి కోటి సూర్యం తెలిపారు. పట్టణంలోని మెయిన్ బజారులో 15 మంది దివ్యాంగుల కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు తమ వంతుగా అండగా నిలిచే విషయంలో దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. దివ్యాంగులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు బాలాజీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం



పేటలోని గోపాలకృష్ణ సొసైటీ వద్ద అధికారులతో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు



మంగొల్లు సొసైటీ వద్ద యూరియా కోసం వచ్చిన రైతులు



గోపాలకృష్ణ సొసైటీ వద్ద యూరియా కోసం రైతుల ఎదురు చూపులు

జగ్గయ్యపేట అర్బన్: యూరియా పంపిణీలో కూటమి ప్రభుత్వం విఫలం అవడంతో అన్నదాతలకు అగచాట్లు తప్పడంలేదని, ఏ ఎరువుల షాపు వద్ద చూసినా, ఏ సొసైటీ కేంద్రం వద్ద చూసినా క్యూలైన్లలో యూరియా అందక రైతన్నలు పడుతున్న ఇబ్బందులే కనిపిస్తున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆరోపించారు. జగ్గయ్యపేట పట్టణంలో శనివారం గోపాలకృష్ణ సొసైటీ వద్ద యూరియా పంపిణీ చేస్తున్నారని తెలుసుకొని రైతులు బారులు తీరారు. విషయం తెలుసుకున్న తన్నీరు నాగేశ్వరరావు పార్టీ నేతలతో కలిసి గోపాలకృష్ణ సొసైటీ కేంద్రాన్ని సందర్శించారు. యూరియా పంపిణీ విధానాన్ని, రైతులకు సరిపడా అందుతుందా లేదా అన్నదానిపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలన్న చిత్తశుద్ధి కూటమి ప్రభుత్వానికి లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉదయం నుంచి పడిగాపులు కాసి అరకొర కేటాయింపులతో ఒక పాస్‌బుక్‌కు ఒక బస్తా యూరియాతో సరిపెడుతున్నారన్నారు. రైతుల అవసరాల మేరకు యూరియా బస్తాలు అందడంలేదని, దీంతో బ్లాక్ మార్కెట్‌లో ఎక్కువ ధర చెల్లించి కొనాల్సి వస్తోందని వాపోయారు. ఇంకా కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు యూరియాను రైతులకు సరిపడే విధంగా అందించాలని సూచించారు.

ఎగబడిన రైతులు

యూరియా బస్తాల కోసం పట్టణంలోని గోపాలకృష్ణ సొసైటీ వద్ద శనివారం రైతులు ఎగబడ్డారు. పెద్ద సంఖ్యలో రైతులు తరలిరావడంతో అగ్రికల్చర్, రెవెన్యూ, గోపాలకృష్ణ సొసైటీ సిబ్బంది పోలీసుల సహాయంతో యూరియాను పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల మధ్య 300 మందికి పైగా రైతులకు యూరియాను పంపిణీ చేసినట్లు అధికారులు చెప్పారు. పాస్‌బుక్‌కు ఒక్క యూరియా బస్తానే ఇస్తున్నారని పలువురు రైతులు వాపోయారు. యూరియా కోసం ఎగబడుతున్న రైతుల బలహీనతను దృష్టిలో పెట్టుకొని సొసైటీ సిబ్బంది గోడౌన్ నుంచి యూరియా బస్తాలను రైతులతోనే మోపిస్తున్నారని చెపుతున్నారు.

యూరియా కోసం రైతుల పాట్లు

మంగొల్లు(వత్సవాయి): ఒక బస్తా యూరియా కోసం రైతులు నానాపాట్లు పడాల్సి వస్తోంది. యూరియా బస్తా కోసం రైతులు కొట్లాడుకునే పరిస్థితికి వచ్చిందని రైతులు వాపోతున్నారు. ఒక బస్తా అయినా యూరియా దొరికితే చాలు అన్నట్లుగా ఉంది రైతుల పరిస్థితి. శనివారం మండలంలోని మంగొల్లు సొసైటీకి 300 బస్తాల యూరియా వచ్చింది. అయితే రైతులు పెద్దసంఖ్యలో రావడంతో వచ్చిన బస్తాలు సరిపోకపోవడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు. యూరియా కోసం గతంలో ఇటువంటి ఘటనలు ఎప్పుడూ చూడలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో యూరియాకు కొరత అనేది లేదు. రైతుల అవసరాలమేరకు ఎప్పుడు కావాలంటే అప్పుడు పుష్కలంగా యూరియా దొరికేది. సొసైటీలతో పాటు అన్ని దుకాణాలలో రైతులకు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం వరి పంటకు యూరియా అవసరం, కానీ యూరియా దొరకకపోవడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోక దిక్కులు చూస్తున్నారు.

వైద్య శిబిరం పరిశీలన



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డెప్యూటీ ఎంపీడీవో

వీరులపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డెప్యూటీ ఎంపీడీవో శేఖర్ పేర్కొన్నారు. మండలంలోని అల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పొన్నవరం గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. వైద్యాధికారి అన్వేష్ మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి శనివారం ఒక గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి జ్వరం, బీపీ, షుగర్ టెస్టులు చేసి వైద్య సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సీహెచ్‌వో నాగరాజు, ఏఎన్ఎం. వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలోనే మైనార్టీల సంక్షేమం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు



మైనార్టీ నేతలను సన్మానిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నేతలు

జగ్గయ్యపేట అర్బన్: ముస్లిం మైనార్టీలకు అన్ని విధాలుగా న్యాయం జరిగింది. వారి సంక్షేమానికి పెద్ద పీట వేసింది గత వైఎస్సార్ సీపీ పాలనలోనేనని ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల కాలంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆదేశాలతో నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు సిఫార్సు మేరకు పార్టీ జిల్లా మైనార్టీ కార్యదర్శిగా షేక్ లాల్‌జాన్, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా షేక్ ఖాదర్‌బాబు, షేక్ ఖాదర్ నియమితులయ్యారు. వీరిని శనివారం పార్టీ కార్యాలయంలో తన్నీరు నాగేశ్వరరావు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తమకు ఈ పదవులు వచ్చినందుకు కృతజ్ఞతగా తన్నీరు నాగేశ్వరరావును ముస్లింలు సన్మానించారు. అనంతరం తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ముస్లింలకు మంత్రివర్గంలో స్థానం కల్పించడమేకాకుండా ఉప ముఖ్యమంత్రి పదవి కూడా ఇచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అంతేకాక ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది కూడా వైఎస్సార్ పాలనలోనేనన్నారు. హజ్ యాత్రకు వెళ్లేందుకు ఆర్థిక సహాయం పెంచడమేకాకుండా హజ్‌యాత్ర ప్రయాణ సౌకర్యం సులభతరం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాసగౌడ్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రాష్ట్ర యూత్ కార్యదర్శి శివరాత్రి పృధ్వీ, పార్టీ జిల్లా కార్యదర్శులు షేక్ జుబేర్, మాతంగి నాగబాబు, మండల యూత్ అధ్యక్షుడు సయ్యద్ షాబుద్దీన్, పట్టణ సోషల్ మీడియా అధ్యక్షుడు షేక్ సయ్యద్‌ఆలీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవం



పెనుగంచిప్రోలు పంచాయతీ కార్యాలయం వద్ద గణనాథుడి ఊరేగింపులో భక్తులు

పెనుగంచిప్రోలు: మండలంలోని పలు గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు చవితి పందిళ్లలో పూజలు అందుకున్న గణనాథుని విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహ నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఊరేగింపు అనంతరం విగ్రహాన్ని స్థానిక మునేరులో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ జంగం శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. పెనుగంచిప్రోలు, పలు గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తీన్‌మార్ మోతలు, బాణాసంచా మెరుపుల మధ్య జరిగాయి. ఊరేగింపుల అనంతరం విగ్రహాలను స్థానిక మునేరులో నిమజ్జనం చేశారు.

గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు

కంచికచర్ల: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో వాణిజ్య గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిదవ రోజు కావటంతో ఇబ్రహీంపట్నంలోని ఫెర్రి కృష్ణానదిలో ఉత్సవ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. స్వామి వారి లడ్డూలను వేలం వేయగా గ్రామానికి చెందిన అయ్యప్ప మొబైల్స్ యజమాని శ్రీకాంత్ స్వామి వారి 27 కేజీల లడ్డూని రూ.1,19,999లకు దక్కించుకున్నారు. రెండవ స్వామి వారి లడ్డూని దేవిరెడ్డి శ్రీనివాసరావు రూ.30 వేలకు దక్కించుకున్నారు. ముందుగా 2 వేల మందికి అన్నదానం చేశారు.

నందిగామ రూరల్: వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రత్యేక మండపాలలో కొలువుదీరిన గణనాధులు 11 రోజుల పాటు నిత్య పూజలందుకుని నిమజ్జనానికి తరలి వెళ్లారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన గణనాథులను నిర్వాహకులు శనివారం రాత్రికి కృష్ణానది, మునేటిలో నిమజ్జనం చేశారు. పట్టణంలోని గాంధీ సెంటరు, వాసవీ మార్కెట్, ప్రభుత్వాస్పత్రి రోడ్డులో, ముక్కోటి మహా మండపంలో ఏర్పాటు చేసిన 15 అడుగుల మట్టి గణపయ్యలకు నిర్వాహకులు నిమజ్జనోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.



శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో గణనాథుడి నిమజ్జన ఊరేగింపు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని కృష్ణానది వద్ద శనివారం వినాయక నిమజ్జనాల సందడి అత్యంత వైభవంగా జరిగింది. పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన మంటపాలలో 11 రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న గణనాథులను శనివారం నిమజ్జనాలు చేశారు. ప్రత్యేక వాహనాలలో డప్పు వాయిద్యాలు, తీన్మార్ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి నది వద్ద పూజలనంతరం కృష్ణానదిలోకి చేర్చారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నిమజ్జన వేడుకలను వైభవంగా నిర్వహించారు. చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్, ట్రైనీ ఎస్ఐ మణికంఠ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రూ.23 వేలకు లడ్డూ ప్రసాదం..

పట్టణంలోని బ్రాహ్మణ బజారులోని లంబోధర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూ వేలం శుక్రవారం రాత్రి నిర్వహించారు. మోతుకూరి అరుణశ్రీ రూ.23 వేలకు దక్కించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, లక్కీడీప్ కార్యక్రమాలను నిర్వహించారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో శనివారం గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక బంగారుకొట్ల సెంటర్‌లోని స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి వసంతోత్సవం ఘనంగా జరిగింది. పిల్లలమర్రి నాగకృష్ణశర్మ ఆధ్వర్యంలో షరాబువర్తక సంఘం అధ్యక్షుడు శ్రీరాం సుబ్బారావు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), సంఘం ప్రధాన కార్యదర్శి కొంకిమళ్ల మల్లిఖార్జునరావు, గౌరవ అధ్యక్షుడు శ్రీరాం రామకృష్ణ తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. రథోత్సవాన్ని ప్రారంభించారు. బంగారు వ్యాపారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ వసంతోత్సవంలో పాల్గొన్నారు. చిరునగర్‌లోని మండపంలోని గణనాథుని నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిరనగర్ ఉత్సవ కమిటీ నిర్వహించిన లడ్డూ ప్రసాదం వేలంలో సిరిగిరి పవన్, అక్షయ బన్నీ రూ. 1,20,000లకు కైవసం చేసుకున్నారు.



నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



నిమజ్జనానికి తరలుతున్న వాసవీ మార్కెట్ గణనాథుడు



కంచికచర్లలో గణనాథుడు

భీమేశ్వర కాలనీలో వెలుగు చూసిన బాణసంచా



రోడ్డు వెంట పడేసిన బాణసంచా తయారీ ముడిసరుకు, ఉల్లిపాయ బాంబులు

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి భీమేశ్వర కాలనీలో ఈనెల 2న ఓ ఇంట్లో జరిగిన బ్లాస్టింగ్ అనంతరం అనేక విషయాలు వెలుగు చూస్తున్నాయి. కాలనీలోని వివిధ ప్రాంతాల్లో బాణసంచా తయారీకి వినియోగించే పదార్థాలు, తయారు చేసిన బాణసంచా వస్తువులను స్థానికులు శనివారం సాయంత్రం గుర్తించారు. విషయాన్ని పోలీసులకు తెలియజేయగా అక్కడికి చేరుకున్న పోలీసులు బాణసంచాకు వినియోగించే లిక్విడ్, సూర్యకారం, తయారు చేసిన ఉల్లిపాయ బాంబులు స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో నుంచి బయటకు అడుగు వేయాలంటే భయమేస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు ఎక్కడ ఏమి జరుగుతుందో తెలియడం లేదని, పిల్లలు తిరిగే ప్రాంతాల్లో పేలుడు పదార్థాలు పడేయటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పేలుడు ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి నిందితులను గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు.

పండుగల విశిష్టతను చెప్పాలి

నందిగామ టౌన్: పట్టణంలోని మెయిన్ బజారులో ఏర్పాటు చేసిన గణనాథుని మండపం వద్ద శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్సవాలు, పండుగలను ఘనంగా జరుపుకోవటం వల్ల భావితరాలకు తెలుగు పండుగల విశిష్టతను చాటి చెప్పవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధులు 2024- 25కుగాను రూ.1,24,07,928 మంజూరైనట్లు డెప్యూటీ ఎంపీడీవో పద్మావతి శనివారం తెలిపారు. అన్నవరం రూ.4.45 లక్షలు, అనుమంచిపల్లి రూ.7.60 లక్షలు, బలుసుపాడుకు రూ.4.36లక్షలు,బండిపాలెంకు రూ.9.54 లక్షలు, బూదవాడకు రూ. 17.24 లక్షలు, గండ్రాయికి రూ.13.62 లక్షలు, గౌరవరం రూ.8.36 లక్షలు, జయంతిపురం రూ.12.05 లక్షలు, కెఅగ్రహారం రూ.5.09 లక్షలు, మల్కాపురం రూ.6.14 లక్షలు, ముక్త్యాలకు రూ.7.22 లక్షలు, పోచంపల్లికి రూ.7.83 లక్షలు, రామచంద్రునిపేట రూ.1.65 లక్షలు, తక్కెళ్లపాడుకు రూ.4.97 లక్షలు, వేదాద్రి రూ.5.51 లక్షల చొప్పున మంజూర య్యాయన్నారు. చిల్లకల్లు, తిరుమలగిరి గ్రామాలలో స్థానిక ప్రజా ప్రతినిధులు లేకపోవటంతో నిధులు మంజూరు కాలేదన్నారు.